కథా కౌముది

# ఆఖరు ఫైలు

డేగల అనితాసూరి

"ఏమండీ ఆఫీసుకు టైమౌతోంది లేవండి. ఈ లోపు కాఫీ తెస్తా" అంటూ లేపి వెళ్ళిపోయింది సుభాషిణి.

ఎప్పుడూ "అబ్బా! మరికాస్సేపు పడుకుంటే బాగుండు. అయినా లేవక తప్పదు కదా?" అనుకుని చిరాకుపడే నాకు చటుక్కున మెలకువొచ్చింది. ఓ క్షణం కళ్ళుమూసుకున్నా. రేపిలా అనలేందు కదా సుభాషిణి అనిపించింది. గుండెల్లో ఏదో వెలితి.

నున్నగా షేవింగ్ చేసి స్నానం ముగించి , వద్దన్నా కొడుకు కుట్టించి పెట్టిన క్రొత్త బట్టలు తొడుక్కుని వచ్చేసరికి వేడివేడి టిఫిన్ ప్లేట్ లో వడ్డిస్తూ కనిపించింది సుభాషిణి. కొడుకు ఆఫీస్ కు వెళ్తూ 'బై నాన్నా' అన్నాడు. సరేనని తలాడించి టిఫిన్ ముగించి లేచా. నాకోసం ప్రత్యేకం గా తయారుచేసిన లంచ్ బ్యాగ్ చేతికిచ్చింది సుభాషిణి. ఎప్పుడూ లేంది కోడలు వింద్య కూడా సుభాషిణి తో కలిసి కారుదాకా వచ్చింది సాగనంపడానికి. పెదవులపై నవ్వు వింతగా మెరిసి మాయమైంది.

డ్రైవర్ నాచేతిలోని బ్యాగ్ అందుకుని కారు డోర్ ఓపెన్ చేసి లోపలపెట్టి నిలబడ్డాడు. వాడి కళ్ళలో చిన్నగా మెదిలిన అభిమానపు భావన నా చూపుల్ని దాటిపోలేదు.

@@@@@

రోడ్డుమీద పరుగులుతీస్తోన్న కారు కొద్దిసేపటికే స్లో అయ్యింది. షరా మామూలే. .. ట్రఫిక్ జాం. ఏనుగుల్లా బస్ లు, చిరుతల్లా కార్లు, జింకల్లా బైక్ లు, ఎలుగుల్లా ఆటోలు దేనిపరుగు దానిదే, దేని ఆత్రం దానిదే అన్నట్టు కార్చిచ్చురేగితే దిక్కుతోచక పరుగెట్టే వన్య మృగాల్లా వురుకుతున్నాయ్.

ఎందుకోగానీ రోజులా విసుగు, చిరాకు అస్సలనిపించలేదు. పైపెచ్చు చుట్టూ చూస్తూ హాయిగా ఆస్వాదిస్తున్నా. 'నేనేనా?' అని డౌటొచ్చింది నామీద నాకే!

అలా..అలా..సిగ్నళ్ళు, స్పీడ్ బ్రేకర్లు దాటుకుంటూ ఆఫీసుముందుకొచ్చేశాం. రాజుకోట లాంటి నా కార్యాలయ ద్వారాలు బాహుబలి బాహువుల్లా బారచాచి రారమ్మని స్వాగతించాయి ఎన్నో యేళ్ళ వాత్సల్యమంతా నింపుకున్నట్టు ఆర్తిగా. నిన్నటి వరకూ అనిపించని వింత భావన! ద్వారం లో రక్షకభటులు చేసే ఐ.డి కార్డు పరిశీలన కోపం తెప్పించేది. రోజూ చూస్తున్నా అడుగుతున్నారని. ఈరోజు వారి విధి నిర్వహణా దీక్ష కనిపించిందేమిటో! అడగకముందే ఆదరంగా చూపించి లోపలికి ప్రవేశించాం.

కారులోంచి దిగి లిఫ్ట్ ముందు నిలబడ్డా. ఇంకా ఆరులో వుంది. ఎప్పట్లా అసహనం ఆవరించలేదు. అక్కడున్న తెలిసినవారి శుభోదయ అభివాదాలను అందుకుని ప్రతిగా చిరునవ్వుతో స్పందిస్తూ వేచివున్నా.

నా ఛాంబర్ లోకి అడుగు వేస్తుంటే కాళ్ళలో ఏమిటో చిన్నగా తడబాటు. నా కుర్చీ హాట్సీట్ లా, ఏసుప్రభువు తలమీది ముళ్ళ కిరీటంలా కనిపించేది కాస్తా మళ్ళీ బాల్యాన్ని వెనక్కితెచ్చినట్టు అమ్మపొత్తిళ్ళలా మెత్తగా హాయిగా అనిపించింది. హ్యాండ్ రెస్ట్ మీద చేతులు పెట్టి వెనక్కువాలి దీర్ఘంగా శ్వాసతీసుకున్నా. హిమాలయాల కొండంచున కూడా ఆక్సిజన్ అందినంత ఫ్రీ గా అనిపించింది.

అటెండర్ రిజిష్టర్ తెచ్చి ముందుంచాడు. తెరిచిపట్టుకున్న దానిమీద ఓ సంతకం పడేయటం తప్ప మరో అభిప్రాయం లేని నేను దాన్ని రెండు చేతుల్లోకీ తీసుకుని నెమ్మదిగా సంతకం పెడ్తుంటే వ్రేళ్ళు సన్నగా వణికాయి. ఎన్నిసార్లు నాలో బి.పి. పెంచిందో, ఎన్నిసార్లు లెక్కించుకుంటూ తొందరగా రావాలని ఉరుకులు, పరుగుల తో గుండెవేగం రెట్టింపు చేసిందో గుర్తొచ్చింది. సంతకం చేసి మూసి ఇచ్చాను.

అటెండర్ తీసుకెళ్తుంటే దాని మనసు నాతో నిష్ఠూరంగా పలికినట్టనిపించింది, 'ఇక నా గురించీ నీకే టెన్షన్ వుండదు నేస్తం...ఇక సెలవ్!" అని.

ముఖ్యమైన కొన్ని ఫైళ్ళు సంతకాలకోసం ఎదురుచూస్తూ కనిపించాయి. ఈలోపే స్నేహితులు ..అంటే , ఒకే బ్యాచ్మేట్స్ గా కలిసిన వాళ్ళు, ఈ ముప్పై మూడేళ్ళలో కలిసి పనిచేసిన కలీగ్స్, పరిచయాలతో దగ్గరైనవాళ్ళు ఒక్కొక్కరే, కొంతమందిగానూ కలిసి రాసాగారు.

ఎన్నో సంతోష క్షణాల్ని నెమరేస్కున్నాం, మరెన్నో దాటివచ్చిన కఠిన సమస్యల్ని గుర్తుచేస్కున్నాం, ఇంకెన్నో మధురానుభూతుల్ని పంచుకున్నాం. పెద్దగా నవ్వుకున్నా. ఒకర్నొకరు అభిమానపూర్వకం గా చూసుకున్నాం.

ఆ తరువాతో అరగంట సమయం దొరికింది. అప్పుడు ఫైళ్ళు పట్టుకున్నా. ఎక్కువ లేవు. పదో పదిహేనో అంతే! ముందు జాగ్రత్తగా చాలా వరకూ నిన్ననే ముగించినందువల్ల. రెండుంబావు అవుతోంది. ఇక లంచ్ మేట్స్ వచ్చే టైమవుతోంది.

అన్నీ చూసి ప్రక్కన పెట్టినా ఏమనిపించలేదు. చివరగా ఒక ఫైల్ మిగిలింది. అంతా చదివాక గతం మళ్ళీ సినిమారీల్లా కళ్ళముందు కదలాడింది. ఎన్ని జీవితాల్లో ఈ ఫైళ్ళు వెలుగులు నింపాయో! మరెన్ని జీవితాల్ని తెలిసి తెలిసి ఏమీ చేయలేక రిజెక్టై నిరాశల్లో పడేశాయో. కొన్ని ఫైళ్ళు కలల్లో సైతం కనిపించేవి. మరికొన్నయితే నిద్రపట్టనీకుండా చేసేవి. కొన్నయితే కొర్రీలతో బుర్రను రామకీర్తన పాడించేవి. ఇంకొన్ని బాగా ఏడిపించాక విజేతగా నెగ్గి మనసును ఆనంద డోలికల్లో ఓలలాడించేవి. కొన్ని మొండి ఫైళ్ళ సంగతి తేల్చడానికి ఎన్ని రూల్స్ తిరగేయాల్సొచ్చేదో. మరికొన్నయితే సమయమంతా తినేసి ఎన్నోసార్లు ముఖ్యమైన పుట్టినరోజులు, పెళ్ళిరోజుల్ని సైతం మరిపించి ఇంట్లో అలకలు, గొడవలకు కారణాలయ్యేవి.ఎన్ని స్పీకులు, ఎన్ని డిస్కషన్ లు, ఇంకెన్ని మీటింగ్ లు, ఒత్తిడులు చవిచూపాయో! కానీ, పరిస్థితి ఏదైనా ..రోజులో ఎన్నిసార్లు 'ఫైలు...ఫైలు' అంటూ రామకోటిలా ఫైలు కోటి జపించానో లెఖ్ఖే లేదు. అయినా..ఈ ఫైళ్ళే కదా ఇన్నాళ్ళు నాకు అన్నం పెట్టిన దేవుళ్ళు!?

కొన్నిసార్లు కోపం వచ్చి ఫైళ్ళను పెద్దాఫీసర్లు విసిరేయటం, మరికొన్నిసార్లు ఆ విసురులో తానొచ్చి బల్లమీద గిరాటేయటం జరిగేది. నాకు నేనే క్రొత్తగా ఆలోచిస్తున్నాననిపించింది. ఎప్పుడూ లేంది ఈ ఫైలో దేవతలా అనిపించింది. నెమ్మదిగా ముఖం దగ్గరికి తీసుకుని కళ్ళకద్దుకున్నా. గ్రీన్ పెన్ అందుకుని చివరిగా ఆఖరు ఫైలుమీద సంతకం పెడుతుంటే నా అధికారాన్నెవరో లాక్కొంటున్నట్టు, నీ అవసరమిక తీరిపోయింది వెళ్ళమన్నట్టు, నీ సేవలికో నమస్కారం అన్నట్టు అనిపించింది. కళ్ళలో నీటిపొర చేస్తున్న సంతకాన్ని అలుక్కుపోయినట్టు చేసింది. కానీ, అలవాటు కొద్దీ పెట్టడం పూర్తిచేసి మిగతా ఫైళ్ళ పైన నెమ్మదిగా పెట్టేస్తుంటే గుండెనెవరో చిక్కబట్టినట్టైంది.

"హాయ్...! హాయ్..." అంటూ వచ్చేశారు లంచ్ మేట్స్ ఆరుగురి తో కూడిన బృందం.

"ఏమిటోనోయ్ నీ ఛాదస్తం...ఇవ్వాళ మేమంతా బయట హోటల్లో ట్రీటిద్దామని ప్లాన్ వేస్తే ఆదివారానికి పోస్ట్పోన్ చేశావ్. పైగా ఎవరూ తెచ్చుకోవద్దని స్పెషల్ ట్రీట్ ఇస్తానంటావ్" కినుకగా వాపోయారు వాళ్ళు.

ఈలోపు నా క్యారేజ్లోని వెజిటబుల్ రైస్, గారెలు, పాయసం ప్లేట్లలో వడ్డించాడు అటెండర్. కబుర్లతో తినటం ముగించాక అటెండర్ తో మంచి స్వీట్ షాప్ నుంచీ స్వీట్, హాట్ ప్యాకెట్స్ చేయించి తెప్పించి సెక్షన్లన్నీ స్వయం గా తిరిగి పంచి నమస్కారాలతో సీటుకొచ్చేసరికి నాలుగయ్యింది.

పెద్దాఫీసర్లు, ముఖ్యమైనవాళ్ళు, స్టాఫ్ మెంబర్స్ అంతా కాన్ఫరెన్స్ హాల్లో చేరారు. శాలువాలు సత్కరించాయి, బొకేలు పలకరించాయి, జ్ఞాపిక గుర్తుంచుకొమ్మని నవ్వింది, వీడియోలు, ఫోటోలు తీశారు. నా గురించీ, నిజాయితీ గురించీ, నా కుటుంబం గురించీ చిన్న విశ్లేషణ వినిపించారు. కొందరు నాతో వారి అనుబంధాల్ని గుర్తుచేసుకున్నారు. నేనూ నాకనిపించిన భావాల్ని పంచుకున్నా. అందరికీ కృతజ్ఞతలు తెలిపా. అంతా చప్పట్లతో విషెస్

తెలిపారు. కుటుంబ సభ్యులూ వస్తే బావుండేదన్నారు. నిజమే. కానీ, ఎందుకో నాకే ఇష్టం లేకపోయింది. వారిని చూసుకుంటూ వీళ్ళతో పూర్తిమనసుతో ఆస్వాదించలేననిపించింది.

వాహనం వరకూ అందరూ వచ్చి వీడ్కోలు పలికి వెళ్ళారు. అటెండర్ పూలహారాలు, శలువాలు, జ్ఞాపిక, బొకేలు తెచ్చి కార్లో సర్దాడు. కారు కదిలింది.

"సార్..సార్.." ఎవరో కారు కి అడ్డంగా చేయి ఊపుతూ ఆపారు. డ్రైవర్ని ఆపమన్నా. అప్పటికి ఐదున్నరవుతోంది సమయం.

"సార్..ఈ ఫైల్ రావటం కాస్త ఆలస్యమైంది. సారీ మిమ్మల్నిలా ఆపాల్సొచ్చింది. దీనివల్ల ఇతని జీవితం బాగుపడి వీళ్ళనాన్న ఉద్యోగం వస్తుంది" చెప్పాడు సెక్షన్ హెడ్.

వెంటనే ఫైలందుకున్నా. సంతకంచేసి ఇచ్చేశా. తలెత్తి చూస్తే మొన్నామధ్య సెక్షన్ లోనే హార్ట్ ఎటక్ తో వాలిపోయిన సీనియర్ అసిస్టెంట్ భార్య, కొడుకు కనిపించారు. ఇద్దరూ నమస్కరించారు. చెయ్యెత్తి ఫర్వాలేదన్నట్టు చూశాను. వారికళ్ళలోని కృతజ్ఞత నిండిన చూపుల ముందు నా ప్రక్కనున్న శాలువాలు బొకేలు చిన్నబోయాయి.

అప్పుడనుకున్నా. మధ్యాహ్నం నేను పెట్టిందే ఆఖరు ఫైల్ అనుకున్నా. కానీ, నా ఆఖరు ఫైల్ ఎంత మంచి ప్రయోజనంతో ముగించాడా పైవాడు?' అని. కారు సరిగ్గా బిర్లా మందిరం ప్రక్కకే వచ్చింది. అప్రయత్నం గా చెయ్యెత్తి నమస్కరించా తృప్తిగా!

★★★★★★★

Click here to share your comments on this story